సాక్షి
మంచిర్యాల

శనివారం : 22 : జూన్ : 2024



ఆయువు తీస్తున్న క్షణికావేశం

చావు వెనుకాల తరుముకొస్తున్నా బతకాలనే ఆశతో అడవిలోని చిన్న చిన్న జంతువులు పోరాటం చేస్తున్నాయి. కానీ మానవులు చిన్న చిన్న సమస్యలకే ఆయువు తీసుకుంటున్నారు. 8లో▸



ఐఏఎస్ అధికారుల పర్యటన

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పలు జిల్లాల ఐఏఎస్ అధికారులు శుక్రవారం పర్యటించారు. అడవులు, కుంటలు, వాచ్ టవర్, వ్యూ టవర్ పరిశీలించారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌ను హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బెటాలియన్‌ను సందర్శించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కాళిదాసు, నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు మారుతి, కుమారస్వామి పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన కలెక్టర్



కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులును కలిశారు. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన రామగుండం కమిషనరేట్ ప్రాంగణంలోని సీపీ చాంబర్‌లో కలిసి మొక్కను అందజేశారు. పరిచయ కార్యక్రమం అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, క్రైమ్ రేట్ తదితర అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో కృషి చేద్దామని తెలిపారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతినిత్యం యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమీకృత కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ డాక్టర్ అనిత, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖలతో కలిసి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న మానసిక ఒత్తిడి, అలసటతోపాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించే శక్తి యోగాకు ఉందని తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని, ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, యోగ శిక్షకులు డాక్టర్ లక్ష్మణ్, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట శుక్రవారం దళిత సంఘాల శ్రేణులు ధర్నా చేశారు. పుట్టిన శిశువు మృతికి వైద్యులు కారణమని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గత నెల 24న గర్భిణి మౌనిక ఆసుపత్రికి రాగా వైద్యులు నిర్లక్ష్యంగా డెలివరీ చేశారని, పుట్టిన శిశువుకు గాయం కావడంతో ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. శిశువు గురువారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతిచెందిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాల నాయకులు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా యోగా దినోత్సవం



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో సామూహిక యోగాలో కమాండెంట్ జమీల్‌భాషా, సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



యోగా ముద్రలో దొనబంద విద్యార్థులు



శ్రీరాంపూర్: యోగా చేస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలక్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సామూహికంగా యోగా, ధ్యానం, సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. మంచిర్యాలలోని జిల్లా కోర్టు సముదాయంలో స్థానిక మైత్రి యోగా ప్రకృతి చికిత్స కేంద్రం వ్యవస్థాపకులు డాక్టర్ సమీరారెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సమీరారెడ్డిని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, రెండో అదనపు సివిల్ జడ్జి నిరోషా శాలువాతో సన్మానించారు. న్యాయమూర్తి సంపత్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువులు శోభాగోపాలకృష్ణ, గోపిక, వినోద్ పర్యవేక్షణలో నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్లు కాళిదాసు, నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐలు రవి, శ్రీనివాస్, కుమారస్వామి, మారుతి, సురేశ్, ఆర్ఎస్సైలు, శిక్షణ కానిస్టేబుల్ అభ్యర్థులు, బెటాలియన్ సిబ్బంది యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేశారు. రాపల్లిలో నిర్వహించిన యోగా వేడుకల్లో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, నోడల్ అధికారి సదానందం, పంచాయతీ కార్యదర్శి సాయిరాం, టీఏ అన్నమణి పాల్గొన్నారు.

రైతుకు రుణ విముక్తి

- ఒకే విడతలో రుణమాఫీ
- 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న వారికి వర్తింపు
- గతేడాది డిసెంబర్ 9 వరకు కటాఫ్
- సమాచారం ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశాలు
- జిల్లాలో 94 వేల మంది వరకు రైతులు



అరక దున్నుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వ్యవసాయ రుణాలు ఒకే విడతలో మాఫీకి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించారు. ఈ ఐదేళ్లలో జిల్లాలో 90 వేల నుంచి 94 వేల మంది వరకు రైతులు రూ.2లక్షల వరకు రుణాలు పొందినట్లు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోనూ పంట రుణాలు ఆగస్టు 15లోగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు అనే అంశంపై స్పష్టత వచ్చింది. నిర్దేశించిన కాలంలో పంట రుణాలు తీసుకున్న రైతుల సమాచారాన్ని తయారు చేయాలని బ్యాంకర్లను ఆదేశించింది. ఇప్పటికే వానాకాలం సీజన్ మొదలైన తరుణంలో తిరిగి కొత్త రుణాలు, పంట సాగు వంటి వాటిపై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 94 వేల మంది వరకు అర్హులు

జిల్లాలో 3.42లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. 1.57లక్షల మంది రైతులు ఉండగా.. వీరిలో 25వేల మంది వరకు కౌలు రైతులు కూడా ఉన్నారు. ఐదెకరాల పైబడి ఉన్న రైతులకు మాత్రమే బ్యాంకర్లు రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. గత వానాకాలం సీజన్ నుంచి రూ.2లక్షల వరకు పంట రుణం తీసుకున్న వారిలో 94వేల మంది వరకు ఉన్నట్లు బ్యాంకు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీరందరికీ రూ.505 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. ప్రతీ ఏడాది తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేసుకుంటూ కొత్త రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఏటా వడ్డీ జమ చేసుకోవడం, కొంత రుణాన్ని పెంచి ఇవ్వడం చేస్తున్నాయి. జిల్లాలో ఏటా వానాకాలం, యాసంగి పంట రుణాలుగా రూ.1500 కోట్ల నుంచి రూ.1600 కోట్ల వరకు ఇస్తుంటాయి.

మార్గదర్శకాలపై ఉత్కంఠ

రుణమాఫీ వ్యవహారంలో ప్రభుత్వం అర్హతలు, నియమ నిబంధనలు, మార్గదర్శకాలు ప్రకటించాల్సి ఉంది. గత ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ అమలు చేసినప్పుడు కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింపజేసేలా మార్గదర్శకాలు రూపొందించింది. దీంతో అర్హతలు, మార్గదర్శకాలపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. కొందరు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది ప్రభుత్వాలు మాఫీ అనడంతో రెన్యూవల్ కూడా చేయించుకోకుండా తమకు మాఫీ వర్తిస్తుందనే ఆశతో ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. మాఫీ సొమ్ము రైతుల సేవింగ్ ఖాతాల్లో వేస్తుందా.. లేక నేరుగా బ్యాంకు క్రాప్‌లోన్ ఖాతాలో వేస్తుందా అనేది తెలియాల్సి ఉంది. జిల్లాలో 29 బ్యాంకుల బ్రాంచుల ఉండగా ఇందులో 13 బ్యాంకుల వరకు వ్యవసాయ, అనుబంధ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీపై ఇంకా బ్యాంకు అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొంటున్నారు.

ఒకేసారి మాఫీ ఎంతో మేలు..



ప్రభుత్వం రూ.2లక్షల వరకు ఒకేసారి రుణమాఫీ చేయడం ఎంతో మేలు జరుగుతుంది. పంట పెట్టుబడికి ఇబ్బంది లేకుండా అవుతంది. గతంలో విడతల వారీగా మాఫీ చేయడంతో అసలు, వడ్డీ తెలియకుండా పోయింది. నిబంధనలు పెట్టకుండా మాఫీ చేయాలి.

– ఎం.శంకర్, గ్రామం: ఘన్‌పూర్, మం: నెన్నెల

తనిఖీలు షురూ




కిరాణ దుకాణంలో అధికారుల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ నిషేధిత ఉత్పత్తులు, కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 'ఆహారం విష తుల్యం' శీర్షికన 'సాక్షి'లో గత నెల ప్రచురితమైన కథనంపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శుక్రవారం స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు బృందంతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పాన్‌షాపులు, కిరాణ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం గుట్కాపై నిషేధం విధించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ప్రారంభించారు. పాన్‌షాపుల్లో సుమారు రూ.40వేల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగిస్తున్న నిషేధిత కలర్లు, రసాయనాలు, టెస్టింగ్‌సాల్ట్, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు పడేశారు. నిషేధిత ఆహార పదార్థాలు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఒకే నంబరుతో రెండు బిల్లులు..!





ఒకే సీఆర్ నంబర్‌తో ఉన్న రెండు వేర్వేరు కౌన్సెల్ ప్రియాంబుల్ కాపీలు

- బెల్లంపల్లి బల్దియాలో డ్రా కోసం ప్రయత్నాలు
- సంతకం కోసం సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఒత్తిళ్లు
- ప్రభుత్వానికి సరెండర్ కోసం కుయుక్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలో పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో గత ఏడాది చెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు, మట్టి చదును పనులు చేపట్టారు. జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్‌తో వేర్వేరుగా పనులు చేయించారు. కానీ కౌన్సెల్ ప్రియాంబుల్ కాపీపై ఒకే కౌన్సెల్ రెజల్యేషన్(సీఆర్) నంబరుతో పని గంటలు, బిల్లుల గణాంకాల తేడాతో రెండు వేర్వేరు బిల్లులు తయారు చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న సానిటేషన్ అధికారితో కాకుండా సంతకం కోసం ప్రస్తుత అధికారిపై ఒత్తిడి తేవడం అనుమానాలకు తావిస్తోంది. 34వార్డుల్లో రోడ్లకు ఇరువైపుల పిచ్చిమొక్కల తొలగింపు, మట్టి చదును పనులకు బ్లేడ్ ట్రాక్టర్ అద్దెకు తీసుకున్నారు. 48గంటలు పనులు చేయించినట్లు రికార్డు చేశారు. గంటకు రూ.800 చొప్పున మొత్తం రూ.38,400 చెల్లించాల్సి ఉన్నట్లు బిల్లు చేసి సీఆర్ నంబరు 823తో కౌన్సెల్ ప్రియాంబుల్ కాపీ తయారు చేశారు. సరిగ్గా అదే సీఆర్ నంబరు 823తో మరో కౌన్సెల్ ప్రియాంబుల్ తయారు చేసి బ్లేడ్ ట్రాక్టర్‌తో 58 గంటలపాటు మట్టి చదును చేయించినట్లు రికార్డు చేశారు. గంటకు రూ.800 చొప్పున రూ.46,500 అద్దె చెల్లించాల్సి ఉన్నట్లు రెండో బిల్లు సిద్ధం చేశారు.

- పోశమ్మ చెరువు ప్రాంతం, 34వార్డుల్లో రోడ్ల వెంట పెద్ద చెట్లు, పిచ్చిమొక్కల తొలగింపునకు జేసీబీ అద్దెకు తీసుకున్నారు. గంటకు రూ.1,150 చొప్పున 51గంటల పనికి రూ.58,650 చెల్లించాల్సి ఉన్నట్లుగా సీఆర్ నంబరు 824తో కౌన్సెల్ ప్రియాంబుల్ తయారు చేశారు. ఇదే నంబరుతో మరో కౌన్సెల్ ప్రియాంబుల్ రూపొందించి 39 గంటలపాటు జేసీబీతో పని చేయించినట్లు రికార్డు చేశారు. గంటకు రూ.1,150 చొప్పున మొత్తం రూ.44,850 చెల్లించాల్సి ఉన్నట్లు రెండో బిల్లు ప్రతిపాదించారు. ఇలా ఒక్కో పనికి ఒకే వాహనంతో పనులు చేయించి పని గంటలు, అద్దె బిల్లులో హెచ్చుతగ్గులు చూపిస్తూ బిల్లులు

పరిశీలిస్తాను..

ఒకే సీఆర్ నంబరుతో ఒకే పనికి రెండు బిల్లులు తయారు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. ఇటీవలనే ఇంచార్జి బాధ్యతలు స్వీకరించాను. ఆయా పనుల బిల్లులపై అధికారులను అడిగి పరిశీలించి తగిన విధంగా వ్యవహరిస్తాను.

– వెంకటేశ్వర్లు, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

సంతకం కోసం ఒత్తిళ్లు

ఒకే సీఆర్ నంబరు రెండు బిల్లులు చేయడంతో అనుమానం వచ్చిన ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ బిల్లుల డ్రాకు సంతకం చేయడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో చెల్లింపు నిలిచిపోవడంతో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మెజార్టీ సభ్యులు అంగీకరించకపోవడంతో నిరాశకు గురై వేధింపులకు పాల్పడుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని రైస్‌మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 35 రా రైస్‌మిల్లులు 19 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయని, రబీలో లక్షా 56వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 2023–24 సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటి వరకు 27,346 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ పూర్తయిందని, రబీకి సంబంధించి 7,081 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. 10 శాతం కంటే తక్కువగా సీఎంఆర్ డెలివరీ ఉన్న రైస్‌మిల్లులు తనిఖీ చేసి ధాన్యం నిల్వలు పరిశీలించాలని, సరిపడా నిల్వలు లేనట్లయితే కేసు నమోదు చేయాలని తెలిపారు. లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయని రైస్‌మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చాలని ఆదేశించారు.

బీఐఎస్ యాప్ వినియోగదారుల సాధనం

మంచిర్యాలఅగ్రికల్చర్: మార్కెట్లో లభించే అన్ని రకాల ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు బీఐఎస్ కేర్ యాప్ వినియోగదారుల సాధనంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, బీఐఎస్ శాస్త్రవేత్త సూజత, ఎస్‌పీఓ అభిసాయి ఇట్టలతో కలిసి నిత్య జీవితంలో వినియోగించే వస్తువులకు అందుబాటులో ఉన్న భారతీయ ప్రమాణాలు, నాణ్యత పరీక్షలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు, జిల్లా అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు కేర్ యాప్ ఉపయోగపడుతుందని, ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవ

సీఓఈ విద్యార్థికి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థి దుర్గం చరణ్‌తేజ్ ప్రతిష్టాత్మక ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో అతడిని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు అభినందిస్తూ సన్మానించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ రెండు దశల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి సీటు సాధించాడు. కాగా, బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామానికి చెందిన చరణ్‌తేజ్ ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడు తండ్రి మృతిచెందగా, తల్లి దూరమైంది. పెద్దనాన్న దుర్గం వెంకటి, ప్రమీల దంపతులు చేరదీసి చదివిస్తున్నారు.

'అటవీ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

జన్నారం: పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులపై అటవీ అధికారుల దౌర్జన్యాలు, దాడులు ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సీపీఎం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జన్నారం, దండేపల్లి మండలాల్లో అత్యధిక మంది పేదలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారిపై అటవీ అధికారులు దాడి చేయడం సరికాదని, ప్రభుత్వం గతంలో కొందరికి పోడు పట్టాలిచ్చిందని, ఇంకా అనేకమంది పట్టాలు పొందాల్సి ఉందని పేర్కొన్నారు. ఇటీవల తపాలపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రాజుపై అక్రమంగా కేసు పెట్టి జైల్లో పెట్టారని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో అక్రమ కేసులు పెట్టి బంధిస్తున్నారని ఆరోపించారు. పోడు వ్యవసాయదారులపై దౌర్జన్యాలు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కుక్కరికారి బుచ్చయ్య, కొండగొర్ల లింగన్న, లక్ష్మణ్, అబ్దుల్లా, జయ, లక్ష్మి, విజయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన స్వేరోస్ రాష్ట్ర నాయకుడు, సింగరేణి ఉద్యోగి బన్న లక్ష్మణ్‌దాస్ బహుజన సాహిత్య అకాడమీ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకా డమీ జాతీయ అధ్యక్షుడు, అకాడమీ ఫౌండర్ డాక్టర్ నల్ల రాధాకృష్ణ ఎంపిక పత్రాన్ని అందజేశారు. జూన్ 25న హైదరాబాద్‌లో జరిగే 7వ జాతీయ సదస్సులో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కాసిపేట గనిలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తూనే సామాజిక కార్యక్రమాలు చేపట్టి అవార్డు పొందుతున్న సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

డ్రైవింగ్ టెస్ట్‌లో 285 మంది ఉత్తీర్ణత

శ్రీరాంపూర్: ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్‌లో మొత్తం 285 మంది ఉత్తీర్ణత సాధించారు. కంపెనీలో ఉన్న 60 ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల కోసం అంతర్గత అభ్యర్థులతో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నాలుగురోజులుగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తుండగా శుక్రవారం ముగిశాయి. ఇప్పటివరకు మొత్తం పరీక్షలకు 543మంది హాల్‌టికెట్లు పొందగా 498 మంది డ్రైవింగ్ పరీక్ష కు హాజరయ్యారు. వీరిలో 285 మంది అర్హత సాధించి రాత పరీక్షకు ఎంపికయ్యారు. ఈ నెల 31న కొత్తగూడెంలో జరిగే రాతపరీక్షలకు వీరంతా హాజరుకానున్నారు.

బీభత్సం సృష్టించిన కారు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

చెన్నూర్: పట్టణంలో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి స్థానిక పెద్ద చెరువు కట్ట కింద గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కోటపల్లి నుంచి చెన్నూర్‌కు వస్తున్న కారు పెద్ద చెరువు కట్ట కింద ఉన్న విద్యుత్ స్తంభాన్ని అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగి పడింది. కారులోని ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో అందులోని వారు క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కాగా, ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ స్తంభాలు విరిగి రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మూడు గంటల పాటు అధికారులు మరమ్మతు పనులు పూర్తి చేశారు. కాగా, కారులోని వ్యక్తులు ములుగు జిల్లాకు చెందినవారుగా తెలిసినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న విషయం తెలిసిందని, కానీ.. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.


స్కూటీ అదుపు తప్పి ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో గురువారం స్కూటీ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన ఎస్‌కే జలీల్ (41) మృతి చెందినట్లు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేటకు చెందిన జలీల్ ఈసీగా పీహెచ్‌సీలో ఎంఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే గురువారం విధుల కు హాజరయ్యేందుకు తన సొంత స్కూటీపై లక్సెట్టిపేట నుంచి బయలుదేరాడు. మార్గమధ్యలోని రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో జలీల్ తల, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా, శుక్రవారం ఉదయం రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయువు తీస్తున్న క్షణికావేశం

మంచిర్యాలక్రైం: దేవుడు సృష్టించిన సమస్త ప్రాణకోటిలో తెలివైన ప్రాణి అంటే మానవుడే. అత్యంత పిరికి తనంతో ప్రతీ చిన్న విషయానికీ ఆత్మహత్య చేసుకునే ఏకైక ప్రాణి కూడా మనిషే. ఎంతటి గాయమైనా.. నెత్తురు కారుతున్నా.. చావు వెనకాల తరుముతున్నా బతకాలనే ఆశతో తప్పించుకోగలను అనే నమ్మకంతో అడవిలోని చిన్నచిన్న జంతువులు సమస్యలతో పోరాటం చేస్తుంటే... మానవులు మాత్రం చిన్న చిన్న సమస్యలకే తమ ఆయువును వదులుకుంటున్నారు. సమస్యల సుడిగుండం నుంచి బయటపడలేననే అపనమ్మకం, బతుకు మీద భయంతో అవివేకంతో ఊపిరి వదులుతున్నారు. ఇలాంటివారు ఒక్క క్షణం ఆలోచించాలి. ఆత్మహత్య చేసుకోవడానికి ఎంత ధైర్యం చేస్తున్నారో.. బతకడానికి అందులో ఆవగింజంత ధైర్యం చేస్తే చాలు బతికిపోతారు. కారణాలేవైనా సరే సమస్యలపై సమరం చేయాలి. ప్రతీ ప్రాణికి కష్టాలుంటాయనే నిజాన్ని గ్రహించాలి. కష్టాల కడలిని దాటి ముందుకు వెళ్తేనే విజయం వరిస్తుందని గుర్తించాలి. జిల్లాలో 2023 నుంచి 2024 జూన్ వరకు 357 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో 33 శాతం వరకట్నం, 31శాతం భార్యాభర్తల మధ్య అనుమానం, 26శాతం వివాహేతర సంబంధాలు, 5శాతం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, 5శాతం ఇతర కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక కథనం..

- కలకలం రేపుతున్న వరుస బలవన్మరణాలు
- బతికి సాధించాలంటున్న మానసిక వైద్యనిపుణులు



రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య

మన దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతూనే ఉంది. మానసిక కుంగుబాటుతోనే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం మన దేశంలో 10లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. రోజుకు ప్రపంచ వ్యాప్తంగా 3వేల మంది బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ప్రతీ 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. పంట దిగుబడి రాలేదని రైతు, పరీక్షల్లో ఫెయిలయ్యానని విద్యార్థి, ప్రేమలో ఓడిపోయానని మరొకరు, ఆరోగ్యం బాగా లేక ఇంకొకరు, ఉద్యోగం రాలేదని ఒకరు, భార్యాభర్తల మధ్య గొడవలు, వరకట్నం వేధింపులతో ఒకరు, అప్పుల బాధతో కొందరు, మద్యం మత్తులో గొడవలతో కొందరు, అలాగే ఒంటరిగా జీవించే వారు, జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు.. లేదా విడాకులు తీసుకున్నవారు, ఇతర శారీరక, మానసిక బాధలతో బాధపడుతున్నవారు.. దీర్ఘకాలిక వ్యాధులు కలిగినవారు.. బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వీరంతా ఆత్మహత్య చేసుకునేముందు ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితాంతం ఆనందంగా గడపవచ్చు.

ఎక్కువగా ఎవరంటే..

మగవాళ్ల కంటే ఎక్కువగా మహిళలే ఆత్మహత్య చేసుకుంటున్నారు. యవ్వనస్తులు, నడి వయస్సు దాటినవారు, ఈ మధ్య కాలంలో 15నుంచి40 ఏళ్లవారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒక్కసారి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన మెదడులో ఉత్పన్నమైందంటే ఏదో ఒకరోజు ఆచరిస్తారు. ఇలాంటివారిని కనిపెడుతూ ఉండాలి. ఒంటరిగా ఉండకుండా చూసుకోవాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులు వారిని కనిపెడుతూ ఉండాలి.

వీరిని ఆదర్శంగా తీసుకుందాం..

ఎందరో మహానుభావులు.. ఎన్నో ఓటములు చవిచూసి ఓటమి నేర్పిన పాఠాలు నేర్చుకుని ఎన్నో విజయాలు సాధించారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే విజయం మీ సొంతమవుతుంది.

- **అబ్రహం లింకన్:** ఇతను రెండుసార్లు వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయారు. శాసనసభ ఎన్నికల్లో ఐదుసార్లు ఓటమి పాలయ్యారు. 26 ఏళ్ల వయసులోనే భార్య మరణించింది. 27 ఏళ్ల వయసులో తీవ్రమైన నాడి రుగ్మతకు గురయ్యారు. అయినా ఎప్పుడూ కుంగిపోలేదు. 52 ఏళ్ల వయసులో అమెరికా అధ్యక్షుడయ్యారు.
- **థామస్ అల్వా ఎడిసన్:** కేవలం మూడు నెలల పాఠశాల అనుభవం ఉంది. ఇతడికి పాక్షిక చెవుడు. రూ.కోట్ల విలువైన ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతైంది. మొదటి బల్బు తయారీ ప్రక్రియలో 10వేల సార్లకు పైగా విఫలమయ్యారు. అయినా అధైర్యపడలేదు. చివరకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తగా ఎదిగారు.
- **అమితా బచ్చన్:** రేడియో వ్యాఖ్యాత ఇంటర్వ్యూలో విఫలమయ్యారు. అతడి గొంతు రేడియోకి పనికి రాదని అవమానించారు. ఆ తర్వాత నటనారంగంలో ఖ్యాతి గడించారు.
- **సచిన్ టెండూల్కర్:** పదో తరగతి ఫెయిలయ్యారు. ఆయనకు క్రికెట్‌లో ఉన్న ప్రతిభతో ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు.

ఇటీవలి ఘటనల్లో కొన్ని..

- హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన గోనె రమ్య (28) ఎనిమిదేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన శేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఇద్దరు మంచిర్యాలలోని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శేఖర్ ఇటీవల మద్యానికి, పేకాటకు బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య కలహాలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో తరచూ కట్నం తేవాలంటూ రమ్యను వేధించాడు. అక్రమ సంబంధం అంటగడుతూ మద్యం మత్తులో చేయిచేసుకునే వాడు. భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటికి వెళ్లి విషయం తెలిపింది. జరిగిన అవమానాన్ని భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన జంజిరాల స్నేహశీల (36) మందమర్రికి చెందిన మహేశ్‌ను ప్రేమవివాహం చేసుకుంది. వివాహమైన ఏడాది నుంచే భర్త నుంచి వేధింపులు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక, కన్న వాళ్లకు చెప్పుకోలేక 13 ఏళ్లు భరించింది. ఇద్దరు కుమార్తెలకు జన్మనిచ్చింది. స్నేహశీల లక్సెట్టిపేటలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తుండేది. మహేశ్ జులాయిగా తిరుగుతూ పేకాట, మద్యానికి బానిసయ్యాడు. అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తూ తరచూ కొడుతుండేవాడు. భర్త వేధింపులు భరించలేక ఈ నెల 16న స్నేహశీల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- ఈ నెల 20న నస్పూర్ మండలం సంఘమల్లయ్య పల్లెకు చెందిన రెడ్డి శ్రీనివాస్–అనూష దంపతుల కుమారుడు సాయిచరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. అతడిని పుస్తకాలు ఎక్కడ పడేసుకున్నావని తండ్రి మందలించగా క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆత్మస్థైర్యం నింపాలి



ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. కొందరు మద్యానికి బానిసలవుతారు. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడరు. ప్రతీ చిన్న విషయానికి చిరాకు పడుతుంటారు. ఈ లక్షణాలు కలిగిన వారిలో చాలా మంది ఆత్మహత్యకు పాల్పడతారు. వీరిని మొదట గమనించాలి. జీవితంలో విజయాలు సాధించిన వారి కథలు చెబుతూ వీరిలో ఆత్మస్థైర్యం నింపాలి. అయినా మార్పు రాకుంటే మానసిక వైద్యనిపుణులకు చూపించాలి.

– విశ్వేశ్వర్‌రావ్, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాల

బతికి సాధించాలి



ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. చిన్నపాటి సమస్యలకు మానసికంగా కుంగి ఆత్మహత్యకు పాల్పడవద్దు. అండగా కట్టుకున్నవారు, కన్నవారు, స్నేహితులుంటారు. అన్నింటికీ మించి మనల్ని సృష్టించిన ఆ భగవంతుడున్నాడన్న నమ్మకంతో పట్టుదలతో పోరాడాలి. ధైర్యంగా నిలబడాలి. మనిషి నిత్య విద్యార్థి. ఓటమి వెనుక విజయం ఉందని గ్రహించాలి. అప్పుడే విజయం నీ సొంతమవుతుంది.

– బన్సీలాల్, సీఐ, మంచిర్యాల

సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించాలి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి బొగ్గు గనుల్లో విషవాయువుల మధ్య అలుపెరుగని శ్రమ చేస్తూ అనారోగ్యం బారిన పడిన కార్మికులు సింగరేణి ఆస్పత్రులకు వెళ్తే వైద్యం అందని ద్రాక్షగా మారిందని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో ఆరోపించారు. కొన్ని సింగరేణి ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో లేవని తెలిపారు. ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు కూడా పని చేయడం లేదని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది కొరతతో కార్మిక కుటుంబాలకు వైద్యసేవలు అందడం లేదని తెలిపారు. ఏటా రూ.వేల కోట్ల లాభాల్లో ఉన్న సంస్థ రోగులకు అరకొర వైద్యం, నాసిరకం మందులు అంటగడుతోందని ఆరోపించారు. భూపాలపల్లి, గోదావరిఖని, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది వైద్యం కోసం వచ్చే సింగరేణి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వైద్య సిబ్బందితో అవమానకరంగా వ్యవహరిస్తూ ఆస్పత్రి సిబ్బందిని కూడా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యమైన మందులు సిద్ధంగా ఉంచాలని, కార్మికులపై వివక్ష చూపకుండా మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు.

లైంగికదాడికి యత్నించిన ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికదాడికి యత్నించిన కేసులో ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన చునార్కర్ ముకుందరావుకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన వివాహితను వరుసకు మామ అయిన చునార్కర్ ముకుందరావు చేను పని మీద వెళ్లి ప్రతీసారి తన కోరిక తీర్చమని వెంటపడ్డాడు. సదరు మహిళ నిరాకరించగా వేరే వాళ్లతో అక్రమ సంబంధముందని నానా బూతులు తిడుతూ దుష్ప్రచారం చేశాడు. ఈ క్రమంలో 2021 జనవరి ఒకటిన రాత్రి ఏడు గంటల ప్రాంతంలో భర్త లేని సమయంలో సదరు మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన ముకుందరావు ఆమె చేయి పట్టిలాగాడు. లైంగికదాడికి యత్నిస్తుండగా అదే సమయానికి ఆమె భర్త రావడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జగన్మోహన్ రావు వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ సతీశ్, ఎస్సై రాజేశ్వర్, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

యోగాను జీవితంలో భాగంగా మార్చుకోవాలి


యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగంగా మార్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులతో కలిసి ఆసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరంతర యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యోగా శిక్షణ ఇస్తోందని తెలిపారు. యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, చొక్కయ్య ఆసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఏజీఎం తిరుమల్‌రావు, సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు రమేశ్, డీజీఎం రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్ ఎస్ఈ భాషా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సెయింట్ ఆగ్నేశ్ పాఠశాలలో శుక్రవారం ఇంటర్నేషనల్ యోగా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని, సెక్యూరిటీ విభాగాల గైర్హాజరు ఉద్యోగులకు శుక్రవారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉద్యోగులు గైర్హాజరు కావడానికి గల కారణాలు తెలుసుకున్నారు. నిర్ణీత మస్టర్లు లేకుంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకనుంచి సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్, పాలకుర్తి రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వ్యాగన్‌లో బియ్యం చోరీ

- నిందితులను పట్టుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు


ఆర్‌పీఎఫ్ పోలీసుల అదుపులో నిందితులు, ఆటోలు

మంచిర్యాలక్రైం: ఎఫ్‌సీఐ బియ్యం లోడ్‌తో స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలు వ్యాగన్‌లో నుంచి ఈ నెల 20న 23 బియ్యం బస్తాలను దొంగిలించిన ముఠాను రామగుండం ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాము నుంచి మహారాష్ట్రలోని రత్నగిరికి తరలించేందుకు గూడ్స్ రైలు వ్యాగన్‌లో బియ్యం లోడ్ చేసుకుని వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. గమనించిన ఓ దొంగల ముఠా ఈ నెల 20న రాత్రి పథకం ప్రకారం గూడ్స్ వ్యాగన్ తలుపులు తెరిచి 23 బియ్యం బస్తాలు దొంగిలించారు. దొంగతనం జరిగిన విషయంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగి చోరీకి పాల్పడిన వారి కోసం గాలించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల ఆచూకీ కనుగొన్నారు. వీరిలో స్థానిక గోపాల్‌వాడలో నివాసముంటున్న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జిల్లా తిర్యాణికి చెందిన గుమ్ముల భీమయ్య, స్థానిక సాయికుంటకు చెందిన జనగామ దినేశ్, మందమర్రి మండలం తిమ్మాపూర్‌కు చెందిన కున్సోత్ వెంకటేశ్, తిలక్‌నగర్‌కు చెందిన అన్నెల వంశీని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. భీమయ్య ఇంట్లో దాచిన బియ్యం బస్తాలతోపాటు చోరీకి ఉపయోగించిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. నిందితులను కాజీపేటలోని రైల్వే కోర్టులో రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. చోరీ జరిగిన 20గంటలు గడవక ముందే నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఏఎస్సై శేఖర్‌రెడ్డి, ఐలయ్య, సుమన్‌ను అధికారులు అభినందించారు.

కర్మ కార్యక్రమానికి వచ్చి..

- గోదావరిలో మునిగి యువకుడి మృతి


పుష్కర ఘాట్ వద్ద గాలింపు చర్యల్లో ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన చింతకింది ఉదయ్‌కుమార్ (23) అనే ఆటో డ్రైవర్ శుక్రవారం గోదావరిలో నీటి మునిగి చనిపోయాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకెనపల్లికి చెందిన ఉదయ్‌కుమార్ తన స్నేహితుడు వెంకటేశ్ తల్లి మూడు నెలల కర్మ కార్యక్రమానికి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ముల్కల్ల గోదావరికి ఆటోలో వచ్చాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం గోదావరిలోకి స్నానాలకు చేసేందుకు వెళ్లారు. నలుగురు స్నేహితుల్లో ఉదయ్‌కుమార్ గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. తోటి స్నేహితుడు గోదావరిలో తమ కళ్ల ముందే గల్లంతు కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఘటనా స్థలానికి చేరుకుని ఉదయ్‌కుమార్ కోసం దాదాపు గంట పాటు గాలింపు చర్యలు చేపట్టగా చివరకు అతడి మృతదేహం లభించింది. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇసుక తరలిస్తున్న లారీలు, జేసీబీ పట్టివేత


ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీలు, జేసీబీ

రెబ్బెన: మండలంలోని రాంపూర్ శివారులోగల ఓ పరిశ్రమ నుంచి అక్రమంగా ఇసుకను రెండు లారీల్లో తరలిస్తుండగా గురువారం రాత్రి గ్రామస్తులు పట్టుకుని మైనింగ్, పోలీస్ అధికారులకు అప్పగించారు. మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అభివృద్ధి పనుల కోసం ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా రాంపూర్ శివారులోని ఓ పరిశ్రమ నుంచి రెండు లారీల్లో ఇసుకను తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డగించి సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో రెబ్బెన పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలతో పాటు ఇసుక లోడింగ్ కోసం వినియోగించిన జేసీబీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన యజమానులు రాకపోవటంతో ఇంకా జరిమానా విధించలేదని తెలిపారు.

బొగ్గు బ్లాక్‌ల వేలంపై భగ్గుమన్న కార్మికులు


ర్యాలీ తీస్తున్న నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సింగరేణి కార్మికులు భగ్గున మండారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా శాంతిఖని గని కార్మికులు, ఏఐటీయూసీ శ్రేణులు గని ఆవరణలో నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. జాతీయ సంపద పేరుతో బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ పరం చేయడానికి కంకణం కట్టుకుందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి బడా పెట్టుబడిదారులపై ఉన్న ప్రేమ కార్మికులపై లేదని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణికి భవిష్యత్‌లో బొగ్గుబ్లాక్‌లు దక్కకుండా చేయాలనే కుటిల బుద్ధితో వేలం వేయడానికి సిద్ధపడిందని ఆరోపించారు. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. భేషరతుగా తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి డీ తిరుపతిగౌడ్, గని అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మంతెన రమేశ్, నాయకులు బొంకూరి రాంచందర్, ఆర్.ప్రవీణ్, పీ సురేశ్, డీ రమేశ్, రామకృష్ణ, ఎస్.శ్రీనివాస్, ఎం.రమేశ్, భాస్కర్, హరిబాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య మాట్లాడారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన 10 రోజుల్లోనే సింగరేణి ప్రాంతానికి చెందిన బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయడానికి వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రాంతాల్లోని బొగ్గు నిక్షేపాలను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడంలో భాగంగానే వేలం పెడుతోందని ఆరోపించారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఉనికికే ప్రశ్నార్థకం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని విమర్శించారు. దీనిని కార్మిక వర్గం ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, నాయకులు రాచర్ల చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, సారయ్య, మోతె లచ్చన్న, రాజయ్య, గొల్లపల్లి రామచందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ లేకుండా గనులు కేటాయించాలి

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను టెండర్ లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏరియా వర్క్‌షాపులో నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్ ప్రక్రియను ప్రతిఘటించి తెలంగాణలోని నూతన బొగ్గు గనులు సింగరేణికి ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండా కేటాయించేదాకా ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు సుదర్శన్, బానయ్య, రాజేశం, తిరుపతి, భూమయ్య, ప్రభాకర్ తదితరులున్నారు.

గని మేనేజర్‌పై చర్య తీసుకోవాలి

బొగ్గు గనులను టెండర్ లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టడానికి కేకే–5 గని పైకి వచ్చిన ఐక్య కార్మిక సంఘాల నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. గని వద్ద ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని గని మేనేజర్ అల్లావుద్దీన్ నాయకులను అడ్డుకున్నారు. ఈ విషయమై నాయకులు మాట్లాడుతూ.. గని మేనేజర్ కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ.. అతడిపై సంస్థ సీఎండీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి శ్రీనివాస్, జాఫర్, ఏఐఎఫ్‌టీయూ కార్యదర్శి పోషమల్లు, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గట్టయ్య ఉన్నారు